క్లుప్తంగా

సాక్షిగణపతికి విశేషపూజలు


సాక్షిగణపతి

శ్రీశైలం: శ్రీశైలమహా క్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

విద్యుత్ బల్బుల ఏర్పాటు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీలో సర్పంచు వరప్రసాద్ బుధవారం వీధి బల్బులను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని తుమ్మలూరు, క్రిష్టారావు పేట గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడ కూడా అంధకారం ఉండకూడదన్నారు. వీధుల్లో పలు చోట్ల బల్బులు కాలిపోయాయని, మరి కొన్ని పగిలిపోయాయని ప్రజలు తెలిజేయడంతో వెంటనే కొత్తవాటి ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు.

నాయకుల సహకారంతో లక్ష్యాలు పూర్తి చేయాలి

పగిడ్యాల: స్థానిక నాయకుల సహకారం తీసుకుని పక్కా గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ ప్రొగ్రెస్‌పై క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆదర్శ కాలనీలలో చేపట్టిన పక్కా గృహ నిర్మాణాల పురోగతి మందగించడం పట్ల కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారన్నారు.సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జ్యోతి తదితరులు ఉన్నారు

పశువులను రోడ్లపైకి వదిలితే యజమానులపై చర్యలు

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంట గ్రామంలో గోవులు, గేదెలను రోడ్లపైకి వదిలేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బుధవారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ అవుట్ పోస్టులో ఎంపీడీఓ మోహన్‌కుమార్, మండల తహసీల్దార్ రాజేంద్రసింగ్, సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ గంగయ్య యాదవ్, పంచాయతీ కార్యదర్శి బాలూనాయక్ పశువుల యజమానులతో చర్చించారు. ఇకమీదట పశువులు రోడ్లపై కనిపిస్తే యజమానిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. .

సిద్ధేశ్వరం అలుగు సాధనకు ముందుకు రావాలి


మాట్లాడుతుసన్న దశరథరామిరెడ్డి

కొత్తపల్లి: కృష్ణానదిపై సంగమేశ్వరం వద్ద సిద్ధేశ్వరం అలుగు నిర్మాణ సాధనకై రాయలసీమలోని ప్రజలందరూ ముందుకురావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సంగమేశ్వరం వద్ద సిద్ధేశ్వరం జల జాగరణ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికే కాకుండా ఇతర రాష్ట్రాల సైతం నీరందిస్తున్న రాయలసీమ ప్రాంతం ఎడారిలా మారిపోతుందన్నారు. రాయలసీమ సస్యశామలం చేసుకోవాలంటే సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంతోనే సాధ్యమతుందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు అరుణ్, రైతులు చిన్న రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’ని సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్: ఉపాధిహామీ పథకాన్ని చెంచు గిరిజనులు సద్వినియోగం చేసుకుని వారి జీవన ప్రమాణాలు పెంచుకోవాలని శ్రీశైలం ఐటీడీఏ పీవో బి. రవీంద్రారెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పొందిన భూములు కలవారు 150 పని దినాలను కూడా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారి గుండాలనాయక్, టీఏ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్ టూ తిరుమల


మహానందిలో రాజస్థాన్ భక్తులు

మహానంది: హిందూ సంస్కృతీ, సంప్రదాయాలు ఎంతో గొప్పవని రాజస్థాన్ రాష్ట్రంలోని సలసార్‌కు చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి, 65ఏళ్ల వయసున్న రాధేశ్యామ్, బృందం సభ్యులు తెలిపారు. హిందూ ధర్మపరి రక్షణకు సలసార్ నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న వారు బుధవారం మహానందికి చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

విత్తనశుద్ధి.. నాణ్యమైన దిగుబడికి నాంది

- విత్తనశుద్ధి చేయడంతో తెగుళ్ల నివారణ
- 40 రోజుల వరకు చీడ పీడలు బెడద ఉండదు



రైతులకు విత్తనశుద్ధి చేసే విధానాన్ని చూపిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పాములపాడు: ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమతున్నారు. ముందస్తుగానే వర్షాలు కురుస్తుండంతో పొలాలు దుక్కులు దున్నుకునేందుకు అనుకూలంగా మారుతున్నాయి. ఇక విత్తు వేయడమే తరువాయి. అయితే విత్తనానికి ముందు విత్తనశుద్ధి ఎంతో అవసరమని, ఏ పంటలో నైనా నాణ్యమైన అధిక దిగుబడులకు మూలం విత్తనమేనని అధికారులు చెబుతున్నారు. అనాదిగా రైతులు విత్తనానికి రక్షణగా ఎర్రమట్టి, బూడిద, ఆవుపేడ వంటి పదార్థాలను ఉపయోగించడం తెలిసిందే. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి అనేక రసాయనాలు, జీవ సంబంధ రసాయనాలు, జీవన ఎరువులు అందుబాటులోకి వచ్చాయి.

13 వేల ఎకరాల్లో సాగుభూమి

ప్రధానంగా మండలంలో 13వేల ఎకరాల్లో పొలం ఉంది. 10వేల ఎకరాలు ఆయకట్టు, 3వేల ఎకరాలు నానాయకట్టు ఉంది. ప్రధాన పంటలువరి, మొక్కజొన్న, జొన్న, కంది, వేరుశనగ, పెసర, మినుము, మిరప పంటలు సాగు చేయడం జరుగుతుంది. పంటల సాగు చేసే ముందు విత్తనశుద్ధి చేయాల్సి ఉంటుంది.

రోగాలు, తెగుళ్ల బారి నుంచి రక్షణ

పైరు లేత దశలో ఎంతో బలహీనంగా ఉంటుంది. పైరును రోగాలు, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవాలంటే విత్తనం నాటడానికి ముందే విత్తనశుద్ధి చేయాలి. పొడి విత్తన శుద్ధి, తడి విత్తనశుద్ధి, స్లరి ట్రీట్‌మెంటు పద్ధతి (చిక్కని ద్రావణాన్ని విత్తనానికి పట్టించడం) వంటి మూడు రకాలుగా విత్తన శుద్ధి చేసే పద్ధతులున్నాయి. విత్తనశుద్ధి వలన పంట మొలక శాతం పెరుగుతుంది. రోగాలు అరికట్టబడి, పైరు లేత దశలో ఏపుగా ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. పెద్దపొలంలో తెగుళ్ల నివారణకు ఖర్చు తక్కువవుతుంది. మిత్ర పురుగుల సంరక్షణ, వాతావరణ కాలుష్యం నివారణ, విత్తిన 40 రోజుల వరకు పంటలకు ఎటువంటి చీడ, పీడలు ఆశించవు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు.

ఏ విత్తనానికి ఏ మందు వినియోగించాలి..

వరి: వరి ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండిజమ్ మందును ఒక లీటరు నీటిలో కలిపి విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి మండెకట్టి నారు పోయాలి. లేదా వెదజల్లుకోవాలి. వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరీపైరిఫాస్ 2.5 మిల్లీ లీటరు నీటికి కలిపి మందు ద్రావణంలో 10నిమిసాలు ముంచి నాటుకోవడం వలన కాండం తొలిచే పురుగును అదుపు చేసుకోవచ్చు.

మొక్కజొన్న: కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్ అనే మందుతో విత్తన శుద్ధి చేసుకున్నట్‌లెత్తై లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

జొన్న: కిలో విత్తనానికి 3 గ్రాముల థైరం లేదా కాప్టాన్ మందును కలిపి శుద్ధి చేయాలి.

కంది: రైజోబియంను విత్తనంతో కలిపి విత్తితే అధిక దిగుబడి సాధించవచ్చు.

వేరుశనగ: వేరుశనగ కిలో విత్తనానికి 6.5మిల్లీ గ్రాముల క్లోరోపైరిఫాస్‌ను పట్టించి నీడలో ఆరబెట్టి 3గ్రాముల మాంకోజబ్‌ని పట్టించి నాటినట్‌లెత్తై వేరుపురుగు, ఆకుమచ్చ తెగుళ్లను నివారించవచ్చును.

మినుము/పెసర: కిలో విత్తనానికి కార్బోసల్ఫాన్ 30 గ్రాములు, ఇమిడాక్లోప్రైడ్ 5 గ్రాములు, మోనోక్రోటోఫాస్ 5 మిల్లీ లీటర్లుతో విత్తనశుద్ధి చేసుకోవాలి.

మిరప: వైరస్ తెగుళ్ల నివారణకు 150 గ్రాముల ట్రైసోడియం ఆర్థో ఫాస్పేట్‌ను ఒక లీటరు నీటిలో కరిగించి ఆ ద్రావణంలో 20 నిమిషాలు నానబెట్టి తరువాత విత్తనాన్ని 2 సార్లు మంచి నీటిలో కడిగి నీడలో ఆరబెట్టి తగినంత జిగురు పదార్థాన్ని పట్టించి 8 గ్రాముల ఇమిడోక్లోప్రిడ్ తర్వాత 3 గ్రాముల మాంకోజబ్‌ను లేదా కాప్టాన్‌ను కలిపి విత్తనశుద్ధి చేసినపట్‌లెత్తై రసం పీల్చే పురుగుల, మాగుడు తెగులును నివారించుకోవచ్చు.

విత్తనశుద్ధి చేయు విధానం..

ఒక కుండలో గానీ డబ్బాలో గానీ విత్తనాలను పోసి కావలసిన మందు మోతాదు వేసి మందమైన గడ్డను కట్టి కుండను అన్ని వైపులకు బాగా కదపాలి. 24 గంటల పాటు విత్తనాన్ని అలాగే ఉంచి తరువాత విత్తుకోవాలి.

విత్తన శుద్ధి చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సూచించిన మందుతోనే విత్తన శుద్ధి చేయాలి.
- మోతాదుకు మించి మందు వాడరాదు.
- విత్తనశుద్ధి చేసేటప్పుడు విత్తనంపై పొర ఊడిపోకుండా చూసుకోవాలి.
- పప్పు ధాన్యాలు, వేరుశనగ పైర్లకు ముందుగా విత్తనశుద్ధి చేసి తర్వాత రైజాబియం కల్చర్ పట్టించాలి.
- శుద్ధి చేసిన విత్తనాలను తినడానికి, పశువుల దాణాకు వినియోగించరాదు.
- శుద్ధి కోసం ఉపయోగించే రసాయనాలు చాలా అపాయకరమైనవి. కావునా జాగ్రత్తగా ఉండాలి.

50 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నా



50 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాను. ప్రతి పంటకు తప్పని సరిగా విత్తనశుద్ధి చేస్తాను. దీంతో నెల రోజుల వరకు పైరుపై పురుగు శాతం తక్కువగా ఉంటుంది. స్ప్రే చేయాల్సిన అవసరం ఉండదు. విత్తన శుద్ధి చేసుకోవడం వలన మందుల ఖర్చు తగ్గుతుంది. –శివనాగిరెడ్డి, రైతు, పాములపాడు

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేస్తాను



30 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేస్తున్నాను. వ్యవసాయ అధికాల సూచనలతో తప్పని సరిగా విత్తన శుద్ధి చేస్తున్నాను. పైరు లేత దశలో ఉన్నప్పుడు చీడ పీడల నుంచి పైరును కాపాడుకోవచ్చు. ఎకరాకు 30 క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. –నవీన్, రైతు, కంబాలపల్లి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



మండలంలోని ప్రతి గ్రామంలో ఆర్బీకే ఇన్‌చార్జ్‌ల ద్వారా రైతులతో సమావేశాలు నిర్వహించి విత్తన శుద్ధి చేయడం వలన కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకతను తెలియజేస్తూ, విత్తనశుద్ధి ఎలా చేయాలో వివరిస్తున్నాం. సీడ్ విలేజ్, పొలంబడి తదితర కార్యక్రమాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం దాదాపు ప్రతి రైతు విత్తనశుద్ధి చేస్తున్నారు. సబ్సిడీపై ట్రైకోడర్మివిరిడి మందును రైతులకు అందిస్తున్నాం. – ఫణీశ్వరరెడ్డి, ఏఓ

కొలనుభారతి అభివృద్ధికి రూ.కోటి ఇచ్చేందుకు సిద్ధం

ఆత్మకూరు రూరల్: ఎవరైనా ముందుకు వచ్చి కొలనుభారతి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తే తాను కోటిరూపాయలు విరాళంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ తెలిపారు. ఆయన బుధవారం ఆయన శ్రీశైలం వెళ్తూ ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘ నాయకుల వినతి మేరకు కాసేపు పట్టణంలో గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏకైక సరస్వతీ క్షేత్రం నాయకుల సమన్వయం లేక అభివృద్ధికి నోచుకోవడం లేదని, అమ్మవారి క్షేత్రాన్ని అభివృద్ధి పరిచేందుకు తనవంతు సహాయంగా కోటిరూపాయలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అంతకుముందు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు ఆయనను సన్మానించారు. సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు పువ్వాడి భాస్కర్, కృష్ణ, జక్కాయురళి, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, వెలుగోడు ఎంపీపీ లాలంరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ సదనం పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని టూరిస్టు బస్టాండ్ వద్ద భక్తుల వసతి కోసం నిర్మించిన గణేశ సదనమును బుధవారం దేవస్థాన ఈఓ ఎస్.లవన్న పరిశీలించారు. గణేశ సదనములో భక్తులకు గదులను కేటాయించేందుకు అవసరమైన కౌంటర్లు, కంప్యూటర్ సిస్టములను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పరిశీలనలో ఈఈ వి.రామకృష్ణ, ఎం.నరసింహారెడ్డి, ఏఈఈవో శ్రీనివాస రెడ్డి, డీఈ చంద్రశేఖరశాస్త్రి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణకు ఆదేశం

వెలుగోడు: వెలుగోడు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న హరిలీలాపై విచారణకు ఆదేశిస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు ఈఓ హరిలీలా సరైన సమాధానం ఇవ్వడం లేదని, అక్రమాలపై స్పందించడం లేదని న్యాయవాది జాన్ బర్నబాస్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణకు ఆదేశిస్తూ.. విచారణ అధికారిగా డీపీవోను నియమిస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తాం


కీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ

ఆత్మకూరు: క్రీడాకారులకు ఆత్మకూరు పుట్టినిల్లు లాంటిదని, భవిష్యత్తులో క్రీడా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులతో, సీనియర్ సిటిజన్లతో మాట్లాడారు. క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంశా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఆత్మకూరు పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, జడ్పీటీసీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కురుకుంద గ్రామానికి చెందిన గోచా నసిక భర్త పొలం పనిచేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి చనిపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ప్రతి గడపలో సంక్షేమ పథకాల పంట

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- చౌట్కూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: రాష్ట్రంలో ప్రతి గడపలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల పంట పండించారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని చౌట్కూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకం కూడా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టలేదన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా తయారు చేశారన్నారు. ప్రజల కష్టాలను చూసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రల చేసి ప్రజలకు అనుగుణంగా మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఏడాదిలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేచ్చడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కుల, మత రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు పథకాలు వర్తింపజేసే విధంగా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. మా ప్రాంతంలో మల్లికార్జున రిజర్వాయర్ చేపట్టవద్దని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చౌట్కూరు సర్పంచ్ మదార్‌సాహెబ్, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సల్కోటీ గోవర్ధన్‌రెడ్డి, జయరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగటూరు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మండలంలోని శాతనకోట గ్రామానికి తెలుగు నాగలక్ష్మమ్మ, అనురాధ ఇటీవల ట్రాక్టర్ కింద పడి మృతి చెందారు. ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ. 2 లక్షల చొప్పున ప్రభుత్వం సీఎం సహాయక నిధి నుంచి వారి కుటుబాలకు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు నరసింహులు, పరుశరాముడుకి చెక్కులను అందజేశారు. అలాగే జూపాడుబంగ్లా మండల కేంద్రానికి చెందిన వలంటీర్ రియాజ్ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు మంజూరైన రూ. రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి


బాధితుడిని పరామర్శిస్తున్న పీఓ బి. రవీంద్రారెడ్డి

కొత్తపల్లి: మాపై దౌర్జన్యంగా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బలపాలతిప్ప గూడెంకు చెందిన బాధిత చెంచు గిరిజనులు నిమ్మల బాలమ్మ నిమ్మల తిక్కమ్మ, నిమ్మల ఈదన్న, నిమ్మల బాలస్వామి ఐలేని మహేష్ కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి బలపాలతిప్పకు చెందిన పశువుల నారాయణ, పశువుల వెంకటరమణ, పశువుల మల్లికార్జున, లక్ష్మయ్య, బయ్యన్న, అంజన్ శీను, చింతచెట్టు శివ తమపై దాడి చేసి రక్తగాయాలయ్యేలా తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గూడేనికి వచ్చే రొడ్డుకు అడ్డంగా వల ఎందుకు కట్టారు అని అడిగినందుకు.. గిరిజనులైన మీరు మమ్మల్ని ప్రశ్నిస్తారా అని ఇంటిపై దాడి చేశారని వాపోయారు. మహిళలు, చిన్నపిల్లలు అని చూడకుండా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 2 గంటలకు దెబ్బలు తగిలిన తమను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్నారు. నిమ్మల బాలయ్య పరిస్థితి విషమంగా ఉందని, అతని పేగులు బయటికి వచ్చాయని చెప్పారు. ఈ విషయమై ఏఎస్ఐ బాబాఫక్రుద్దీన్‌ను సంప్రదించగా.. ఘటనపై తనకు ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని కేసు నమోదు చేయలేదని చెప్పారు.

చెంచులకు ఐటీడీఏ పీఓ పరామర్శ

ఆత్మకూరు రూరల్: గాయపడి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఐటీడీఏ పీవో బి.రవీంద్రారెడ్డి బుధవారం పరామర్శించి, రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అమాయకులైన చెంచు గిరిజనులపై దాడులు తగవని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధితులకు ధైర్యాన్నిచ్చారు. అనంతరం ఆయన ఈవిషయంపై ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యంతో మాట్లాడి నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

అక్రమ కట్టడాలు నిలిపివేయండి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ పరిధిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సున్నిపెంట సచివాలయం -2లో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మే 11న జీఓ నెం.40ను జారీ చేస్తూ సున్నిపెంట గ్రామాన్ని పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎటువంటి కట్టడాలకు అనుమతించబోమన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు బాలూనాయక్, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

కరివేన సత్రం నూతన గదుల ప్రారంభం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్.నరసింహారావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని అఖిల భారతీయ బ్రహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రంలో నూతనంగా నిర్మించిన గదులను బుధవారం ప్రారంభించారు. బుధవారం వేదమంత్రోచ్ఛరణల మధ్య రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్ నరసింహారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథులుగా పాల్గొని గదులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దేశంలో 12 ప్రాంతాల్లో బ్రహ్మణ సత్రం నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. బ్రహ్మణ సత్రాల నిర్వహణ విషయంలో తమ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో అడ్వైజరీ బోర్డు చైర్మన్ శ్రీనివాస్, అధ్యక్షుడు ఎస్.ఆర్ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, కోశాధికారి హరిహరరావు, ఉపాధ్యక్షులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పాత బట్టువారిపల్లిలో పులి సంచారం

కొత్తపల్లి: మండల పరిధిలోని పాత బట్టువారి పల్లి గ్రామ శివారు సుంకులమ్మ దగ్గర బుధవారం ఉదయం ఓ యువకునికి పులి కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకొని ఆ యువకునితో మాట్లాడారు. ఆ యువకుడు తీసిన పులి పాదముద్రల ఫొటోను ఫారెస్టు అధికారులకు అందజేశాడు. ఆ మేరకు ముసలమడుగు ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో ఆ యువకుడు చెప్పిన ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే అప్పటికే ఆ ప్రదేశంలో గ్రామానికి చెందిన పశువులు వెళ్లడంతో పాదముద్రలు కనిపించలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. గ్రామస్తులకు ఎక్కడైనా ఆనవాళ్లు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఫారెస్టు అధికారులు కోరారు.

లింగాలగట్టు వద్ద రోడ్డు ప్రమాదం

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కొనకనమిట్ల మండలానికి చెందిన వ్యక్తులు అక్కడి దేవాలయంలోని విగ్రహాలను శ్రీశైలం కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు బొలెరో వాహనంలో లింగాలగట్టుకు వెళ్తుండగా డ్యాంసైట్ ప్రాంతంలో అదుపు తప్పి కొండను ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్పంగా గాయపడ్డారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు

నందికొట్కూరు: పట్టణాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తూ, ప్రత్యేక నిధులు కేటాయించారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. పందులు, కుక్కలు బెడద నుంచి పట్టణ ప్రజలను రక్షించాలని కౌన్సిలర్లు కోరారు. అజెండా లోని అంశాలను కౌన్సిలరు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు రాకుండా నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, కమిషనర్ కిషోర్, డీఈ నబి రసూల్, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస రెడ్డి, గఫార్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే సీఎం జగన్ ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

శ్రీశైలంటెంపుల్: ఐక్యరాజ్య సమితి(ఐరాస) నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని ఏపీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. బుధవారం శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శన అనంతరం ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యేకు వేదపండితులు ఆశీర్వచనలు పలుకగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదాలను అందించారు. అనంతరం అతిథిగృహంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సామాజిక, ఆర్థిక అంశాల్లో బలమైన మార్పులు తీసుకువచ్చేలా సీఎం కృషి చేస్తున్నారని తెలిపారు.

మల్లన్నసేవలో ప్రముఖులు


మల్లన్న దర్శనానికి వెళ్తున్న గోపాలకృష్ణ ద్వివేది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం ఏపీ వ్యవసాయ సహకారం, పశు పోషణ, పాల అభివృద్ధి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, రాజ్యసభ సభ్యులు జి.వి.ఎల్.నరసింహారావు, ఏపీ ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, బాపట్ల ఎమ్మెల్యే కొన రఘుపతి, తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు పి.రాములు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఈఓ వారిని సత్కరించారు.

శ్రీశైల దేవస్థానానికి విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు పలువురు భక్తులు రూ.2లక్షల విరాళాలను అందించారు. బుధవారం కర్నూలుకు చెందిన బి.నాగిరెడ్డి అన్నదాన పథకానికి రూ.1,00,011 విరాళాన్ని, కర్నూలుకు చెందిన బి.నాగమల్లేశ్వరరెడ్డి ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1,00,011 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. ఆమె వారికి లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఆత్మీయ సత్కారం


పి.నాగయ్య దంపతులను సత్కరిస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో హెల్పర్‌గా 27 సంవత్సరాలు విధులు నిర్వహించి బుధవారం పదవీవిరమణ పొందిన పి.నాగయ్యకు దేవస్థాన అధికారులు ఆత్మీయ సత్కారం చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఈఓ ఎస్.లవన్న, అర్చకస్వాములు, వేదపండితులు పి.నాగయ్య దంపతులకు వేదాశీర్వచనం చేసి స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ హెచ్.జి.వెంకటేష్, ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు సాయికుమారి, దేవస్థాన ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు పి.వి.సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.